సాక్షి తిరుపతి

మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



పేదలకు దుస్తుల పంపిణీ

క్రిస్మస్‌ను పురస్కరించుకుని రేణిగుంటలో పేదలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. - 8లో



రైతు కడగండ్లను..

రైతులను ఇతివృత్తంగా చేసుకుని మట్టి బండి పుస్తకాన్ని ఆవిష్కరించినట్టు అవధాని మేడసాని మోహన్ తెలిపారు. - 8లో



నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ

డీసీసీబీ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నూతన క్యాలెండర్లను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. - 8లో

న్యూస్‌రీల్

పండుగలా 'ఆడుదాం'

–నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు



వెంకటరమణారెడ్డి, కలెక్టర్

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో 47 రోజుల పాటు ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తారన్నారు. పోటీల్లో 1,53,423 మంది క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు. అంతేకాకుండా 15,150 మంది క్రీడాభిమానులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. క్రీడల నిర్వాహణకు 500 మైదానాలను సిద్ధం చేసినట్లు వివరించారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా క్రీడలు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు ప్రారంభించనున్నట్టు చెప్పారు.

పెరుగుతున్న ఆర్టీసీ రాబడి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ రాబడి క్రమేణా పెరుగుతోంది. సాధారణంగా జిల్లాలో రోజుకు రూ.1.5 కోట్ల నుంచి రూ.1.6 కోట్ల వరకు రాబడి వస్తోంది. అయితే ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం 1.13 లక్షల మంది ప్రయాణికులకు ఆర్టీసీ సేవలను అందించింది. దీంతో రూ.1.98 కోట్లు రాబడి వచ్చింది. ఆదివారం 1.23 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణించారు. దీంతో రూ.2.10 కోట్లు రాబడి వచ్చినట్టు ఆర్టీసీ వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా రోజువారీ ఆదాయం రూ.2 కోట్లకు చేరుకుంటోంది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా తిరుపతి నుంచి శనివారం 54,784 మంది, ఆదివారం 52,172 మంది భక్తులు ఆర్టీసీలో ప్రయాణం చేయడంతో రూ.1.09 కోట్లు రాబడి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మరింత ఆదాయాన్ని పెంచడానికి పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలియజేశారు.

17లోపు పరీక్ష ఫీజు చెల్లించండి

తిరుపతి సిటీ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్యనభ్యసిస్తున్న అభ్యర్థులు మూడు, ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫీజు జనవరి 17వతేదీ లోపు చెల్లించాలని తిరుపతి స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ 2, 3వ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి గడువులోపు పరీక్ష ఫీజులు చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.braouonline.in వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

రాహుకేతు మండపాల పర్యవేక్షణ



రాహుకేతు పూజా మండపాన్ని పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తులు పోటెత్తారు. వరుస సెలవులు కావడంతో సుమారు 28 వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు సత్వరం దర్శనం కలిగేలా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ కంచు గడప వద్ద స్వీయపర్యవేక్షణ చేపట్టారు. అదే విధంగా రాహుకాల సమయంలో రూ.500 రాహుకేతు పూజామండపాన్ని పర్యవేక్షించారు. ఆయన వెంట ఆలయ అధికారులు ఉన్నారు.

తెప్పలపై శ్రీకామాక్షమ్మ వైభవం



తెప్పపై ఊరేగుతున్న శ్రీకామాక్షి అమ్మవారు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం రాత్రి శ్రీకామాక్షి అమ్మవారు తెప్పపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై ఆసీనులైన శ్రీకామాక్షి, లక్ష్మీ, సరస్వతి అమ్మవారు కపిలతీర్థం పుష్కరిణిలో ఏడు చుట్లు విహరించి భక్తులను కటాక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

భరోసాతో సాగు!

రైతుబాగుంటే రాజ్యం బాగుంటుందనే మాటను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిజం చేసింది. ఉన్న గ్రామంలోనే ఆర్బీకేల ద్వారా రైతులకు సకల సేవలు అందిస్తోంది. ఇబ్బందుల్లేకుండా సేద్యం సజావుగా సాగేందుకు తోడ్పాటునిస్తోంది. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు ఎమ్మార్పీకే అందజేస్తోంది. దీనికితోడు ఏ పంటకు ఏ తెగులు సోకిందో అక్కడి సిబ్బంది క్షేత్ర స్థాయిలో గమనించి తగిన సూచనలు, సూచనలు రైతులకు ఇస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.



ముడియూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ

రైతుభరోసా కేంద్రాలతో ఇంటి ముంగిటే సేవలు

- పండుగలా మారిన వ్యవసాయం
- రైతుకు వెన్నుదన్నుగా రాష్ట్ర ప్రభుత్వం
- ఎమ్మార్పీకే ఎరువులు, పురుగు మందులు
- భూసారపరీక్షల ఆధారంగా పంటల సాగు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

సాక్షి, తిరుపతి డెస్క్: ముడియూరు తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలంలో ఉంది. ఒకప్పుడు ఈ ప్రాంత రైతులు విత్తనాలు, పురుగుల మందుల కోసం తమిళనాడుకు వెళ్లేవారు. అధిక ధరకు విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసుకోవాలి. వాటిని తరలించడానికి అద్దె వాహనాలకు అధిక ధర చెల్లించాలి. ఇంత శ్రమ, డబ్బు ఖర్చు చేసినా కొన్నిసార్లు నకిలీ విత్తనాల వల్ల పంట సరిగా వచ్చేది కాదు. రైతుల కష్టాలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాల పరిధిలో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో శనివారం 'సాక్షి' బృందం ముడియూరు రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించింది. అక్కడ అందుతున్న సేవలను గుర్తించి రైతుల మనోగతాన్ని తెలుసుకుంది. ఆర్బీకేలు తమ కష్టాన్ని తీర్చే రథ సారథులు నిలుస్తున్నాయని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేయడం కనిపించింది. ఇంకా వారు ఏమన్నారంటే..

ఆర్బీకేల్లో సేవలు

- నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు
- డిజిటల్ ఆధారితసేవల ద్వారా ఈ మల్టీఫంక్షనల్ కియోస్కులు
- సబ్సిడీపై వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలు
- సీఎం యాప్ ద్వారా పంటలకు గిట్టుబాటు ధర
- భూసారపరీక్షలు
- వైఎస్సార్‌యంత్ర సేవ ద్వారా అందుబాటులో వ్యవసాయ పరికరాలు
- సున్నావడ్డీతో బ్యాంకు రుణాలు
- పొలంబడి ద్వారా రైతుల పొలాల్లోనే శిక్షణా కార్యక్రమాలు



ఉచిత పంటల బీమా

గాలీవాన, మండుటెండలొచ్చినప్పుడు మా పంటలు చేతికొచ్చేవి కావు. అలాంటి సమయంలో తీవ్రంగా నష్టపోయేవాళ్లం. అప్పులపాలై కుటుంబాలు వీధిన పడేవి. అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకోవాలనిపించేది. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రంలో పనిచేసే వ్యవసాయ సహాయకులు మా పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. తద్వారా ఉచిత పంటల బీమా పథకం వర్తిస్తుంది. కష్టకాలంలో పంట నష్టపోయినప్పుడు మేము పెట్టిన పెట్టుబడి బీమా రూపంలో ప్రభుత్వమే చెల్లిస్తోంది.

–ఎ.పరంధామరెడ్డి, మామిడి రైతు, పులింగుంట గ్రామం, ముడియూరు



పంటకు మద్దతు ధర

రైతు భరోసా కేంద్రాల ద్వారా మేము పండించే పంటను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. గతంలో పంట చేతికందే సమయంలో దళారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గించే వాళ్లు. ధర వచ్చేంత వరకు ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి వీల్లేకుండా ఉండడంతో వారు చెప్పిన రేటుకే కళ్లాల్లోనే అమ్మేసే వాళ్లం. ఇప్పుడు పరిస్థితి మారింది. నాలుగేళ్లుగా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటను కొనుగోలు చేస్తోంది. ఆ తర్వాత వెంటనే నగదు చెల్లిస్తోంది. ఆర్బీకేల వల్ల దళారీ వ్యవస్థకు చెక్ పడింది.

–కె.గోపి, వేరు శనగ రైతు, తులసిక్రిష్ణాపురం, ముడియూరు



నకిలీ సమస్య తప్పింది

రైతు భరోసా కేంద్రం ఏర్పడ్డ తరువాత నకిలీ విత్తనాల సమస్య తప్పింది. గతంలో విత్తనాలు కొనాలంటే మండల కేంద్రానికి, లేకుంటే పక్క రాష్ట్రమైన తమిళనాడులోని ఊత్తుకోట, తిరువళ్లూరు, తిరుత్తణి ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు దుకాణాల్లో కొనేవాళ్లం. అక్కడ ఎమ్మార్పీ కన్నా ఎక్కువ డబ్బు పెట్టి కొనాల్సి వచ్చేది. రవాణా ఖర్చులు అదనం. కొన్ని సార్లు నకిలీ విత్తనాల వల్ల పంట సరిగా పెరిగేది కాదు. దీనివల్ల నష్టాలే మిగిలేవి. రైతు భరోసా కేంద్రాలు ఏర్పడ్డ తరువాత నాణ్యమైన విత్తనాలు దొరుకుతున్నాయి. వేరుశనగ, పచ్చిరొట్ట వంటి సబ్సిడీ విత్తనాలూ అందిస్తున్నారు. మూడేళ్లుగా నకిలీ విత్తనాల సమస్య లేదు.

–టీ.గజేంద్రరెడ్డి, వరి రైతు, పులింగుంట గ్రామం, ముడియూరు



సలహాలు, సూచనలు అందిస్తున్నారు

వాతావరణ మార్పులకనుగుణంగా రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులు మాకు సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఏ పంటకు ఎలాంటి ఎరువులు వేయాలి.. పురుగుల నివారణకు ఎలాంటి మందులు వాడాలి.. వాటిని ఎంత మోతాదులో వేయాలి వంటి సలహాలిస్తున్నారు. కొందరు రైతులకు శిక్షణ కూడా ఇస్తున్నారు. గతంలో ఇలాంటి అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు సిబ్బంది సూచనలతో పంటలు సాగుచేస్తున్నాం. పెట్టుబడి భారం తగ్గుతోంది. దిగుబడి మాత్రం భారీగా పెరుగుతోంది. చాలా సంతోషంగా ఉంది.

–ఎస్.దీనదయాళ్, మిర్చి రైతు, పాత తులసి క్రిష్ణాపురం, ముడియూరు



రైతు భరోసా కేంద్రం, ముడియూరు



బైక్, ఆటోలలో ఎరువులు తీసుకెళ్తున్న రైతులు



పులింగుంటలో వ్యవసాయ పనుల్లో రైతు గోపి



రైతు భరోసా కేంద్రంలో ఎరువులు

తిరుపతి, చిత్తూరు జిల్లాల సమాచారం

తిరుపతి జిల్లా	చిత్తూరు జిల్లా
మొత్తం ఆర్బీకేలు 445	మొత్తం ఆర్బీకేలు 502
ఇప్పటివరకు రైతులకు అందించిన సేవలు 4 లక్షలు	ఇప్పటివరకు రైతులకు అందించిన సేవలు 3.28 లక్షలు

ముడిమూరు రైతు భరోసా కేంద్రం పరిధిలో

గ్రామాలు	11	రైతులు	800
సాగుభూమి 2,452 ఎకరాలు			
మామిడి	250	ఉద్దులు	50
చెరుకు	196	సంపంగి	70
వేరుశనగ	336	పూల సాగు	28
వరి	146	కూరగాయలు	40
సజ్జ	163	మిరప	10
ప్రొద్దుతిరుగుడు	60		

ఎదుటే ఎరువు



మూడేళ్లుగా రైతు భరోసా కేంద్రాల్లోనే ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసుకుంటున్నాం. గతంలో మండల కేంద్రానికి వెళ్లి తెచ్చుకునేవాళ్లం. అక్కడ కొన్ని రకాలు దొరికేవి కావు. విధిలేని పరిస్థితుల్లో పక్క రాష్ట్రమైన తమిళనాడుకు వెళ్లి తెచ్చుకునేవాళ్లం. అక్కడ ధరలు అధికంగా ఉండేవి. సమయం, డబ్బు వృథా అయ్యేది. ఆర్బీకేలు వచ్చాక ఈ సమస్య తీరింది. ఆర్బీకేల్లోనే ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీకే విక్రయిస్తున్నారు. ఇక్కడ లేని మందులను ఇండెంట్‌పెట్టి తెప్పించి ఇస్తున్నారు.

–ఎం.మహేష్, చెరుకు రైతు, తులసిక్రిష్ణాపురం, ముడియూరు

బాడుగకు వ్యవసాయ పనిముట్లు



ఆర్బీకేల్లో వ్యవసాయ పనిముట్లు బాడుగకు అందిస్తున్నారు. గతంలో సబ్సిడీ విత్తనాలు మాత్రమే మండల కేంద్రాల్లో ఇచ్చేవాళ్లు. అప్పుడు వాటి కోసం క్యూలో రోజుల తరబడి వేచి ఉండేవాళ్లం. వ్యవసాయ పనిముట్లు ప్రయివేటు దుకాణాల్లో తెచ్చుకోవాల్సి వచ్చేది. ఆర్బీకేలు ఏర్పడ్డ తరువాత ఆ సమస్య తీరింది. రవాణా ఖర్చు.. సమయం కూడా ఆదా అవుతోంది.

– చెంగల్రాయరెడ్డి, వేరుశనగ రైతు, పులింగుంట గ్రామం, ముడియూరు

ప్రగతి'బాట'!

రూ.8 కోట్లతో రామాపురం రహదారికి మహర్దశ

- తుడా, ఆర్ అండ్ బీ భాగస్వామ్యం
- సర్వాంగ సుందరంగా నిర్మాణం
- భూమి పూజ చేసి ప్రారంభించిన చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి





రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి. జేసీబీతో బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం/తిరుపతి రూరల్: అధ్వానంగా ఉన్న రహదారులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సంకల్పించారు. ఇందులో భాగంగా వర్షాలకు దెబ్బతిన్న తిరుపతి రూరల్ మండలం, వేదాంతపురం నుంచి రామచంద్రాపురం మండలం రాయలచెరువు వరకు ఉన్న రహదారి పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్వయంగా జేసీబీ ఎక్కి ఈ డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుడా, ఆర్‌అండ్‌బీ భాగస్వామ్యంతో రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. ఇందులో తుడా నుంచి రూ.4 కోట్లు, ఆర్‌అండ్‌బీ నుంచి మరో రూ.4 కోట్లు మొత్తం రూ.8 కోట్లతో బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. పూతలపట్టు– రేణిగుంట జాతీయ రహదారి నుంచి రాయలచెరువు వరకు బీటీ రోడ్డు పనులు రెండు దశల్లో చేపడుతామన్నారు. రోడ్డు విస్తరణకు అవసరమైన భూసేకరణ ఇప్పటికే పూర్తయిందని, ఈ నేపథ్యంలో మొదటి దశలో జాతీయ రహదారి నుంచి స్వర్ణముఖి వరకు, రెండో దశలో రాయలచెరువు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా వాహనదారులు, ప్రజలు మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ శుభగిరిని తుడా చైర్మన్ ఆదేశించారు. వరద ఉధృతికి దెబ్బ తిన్న బ్రిడ్జీల నిర్మాణ అంచనాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రామచంద్రాపురం, తిరుపతి రూరల్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుడా చైర్మన్ చొరవ

తిరుపతి– పచ్చికాపల్లం ప్రధాన రహదారి ఏర్పాటుకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు తిరుపతి– పచ్చికాపల్లం రహదారి దెబ్బతింది. దీంతో ప్రజలు మోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన చొరవ తీసుకుని తుడా, ఆర్‌అండ్‌బీ నిధులతో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.

పేదలకు పునర్జన్మ ఆరోగ్యశ్రీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం: పేదల సంక్షేమం, ఆరోగ్యాన్ని ఆకాంక్షించి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని, ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరిన్ని వందల జబ్బులను అందులో చేర్చి పేదలకు పునర్జన్మను ప్రసాదించారని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. తిరుపతి ఎంపీ కార్యాలయంలో సోమవారం బాధితులకు ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో వందల జబ్బులను చేర్చి రూ. 2లక్షలు నుంచి రూ. 25లక్షలకు పెంచిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు సైతం మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా కావాలని కోరుకుంటున్నారన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని జబ్బులకు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ఐదుగురు రోగులకు రూ.14.60లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. ఇందులో ఎనుకుల మోతీష్ (ఏర్పేడు) రూ.1.5 లక్షలు, దేవురు శ్రీహరిరెడ్డి (నెల్లూరు జిల్లా) రూ.2.7 లక్షలు, వాకాటి సునీల్‌కుమార్‌రెడ్డి (నాయుడుపేట) రూ.5 లక్షలు, వేదం బాలచంద్రన్ (నెల్లూరు జిల్లా) రూ.1.2 లక్షలు, పేరంశెట్టి రామయ్య (నెల్లూరు జిల్లా)రూ.70 వేలు, వెట్టి కృష్ణయ్య(కేవీబీపురం) రూ.3.5లక్షల చెక్కులను అందుకున్నారు.

శాంతి సందేశం





తిరుపతిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

జిల్లాలో ఆదివారం క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. - సాక్షి, తిరుపతి

క్లుప్తంగా

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: నగరానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి కథనం.. నగరంలోని భవానీ నగర్‌లో నివాసముంటున్న రాజు(30) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసే సమయంలో కడుపు నొప్పి రావడంతో సమీపంలో ఉన్న స్నేహితుడిని తీసుకురావాలని ఆయన భార్యకు చెప్పాడు. దీంతో ఎవరూ లేని సమయం చూసి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉరివేసుకుని మహిళ మృతి

ఓజిలి: మండలంలోని పెదపరియ ఎస్సీ కాలనీకి చెందిన పీ.చెంగమ్మ(43) ఉరివేసుకుని తనువు చాలించింది. పోలీసుల వివరాలు.. పెదపరియ దళితవాడకు చెందిన చెంగమ్మ ఇంట్లో ఒక్కటే నివాసం ఉంటోంది. ఆదివారం రాత్రి భోజనం తర్వాత ఒక్కటే నిద్రించింది. ఈ క్రమంలో ఉదయం ఎంతకీ తలుపు తీయకపోవడంతో గ్రామస్తులు అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. నాయుడుపేట రూరల్ సీఐ సోమయ్య సంఘనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలికి భువనగిరిపాళెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్టు తెలుసుకుని ఆ కోణంలో విచారణ చేపట్టారు. మృతురాలి కుమార్తె సుస్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

భావితరాలకు తెలుగు సంప్రదాయ విలువలు

- ఆటా ముగింపు సంబరాల్లో డెప్యూటీ సీఎం నారాయణస్వామి



బహుమతులు ప్రదానం చేస్తున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: తెలుగు సంస్కృతి, సంప్రదాయ విలువలను భావితరాలకు అందించేందుకు నేటి యువత కృషి చేయాలని డెప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపు నిచ్చారు. అమెరికా తెలుగు అసోసియేషన్ సాంస్కృతిక సంబరాల ముగింపు కార్యక్రమం మహతి కళాక్షేత్రంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డెప్యూటీ సీఎంతో పాటు టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ విద్యాశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి, ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీహరి, ఆటా అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు. అన్నమాచార్య సంకీర్తనల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం టీటీడీ ఈవో మాట్లాడుతూ సాంస్కృతిక సేవా కార్యక్రమాలు చేస్తూ మాతృభూమిని మరిచి పోకుండా ఉండడం అభినందనీయమన్నారు. టీటీడీ విద్యాశాఖాధికారి మాట్లాడుతూ విదేశాల్లో చదువుకుంటున్న తెలుగు విద్యార్థులకు ఆటా నేతలు తగు సలహాలు ఇచ్చి తోడ్పాటు అందించాలని కోరారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి మాట్లాడుతూ నేటి శాస్త్ర సాంకేతిక యుగంలో సైతం మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ యువతను భాగస్వామ్యం చేస్తున్న ఆటా అసోసియేషన్‌ను అభినందించారు. ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు 30 ఏళ్లుగా కృషి చేస్తున్నామన్నారు. అమెరికాలోని తెలుగు వారికి మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేస్తూ యువతను భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. ఓబిలీ హోమ్స్ అధినేత ఓబుల రామచంద్రారెడ్డి ఆటా సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ఆటా ఎలక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా, కోశాధికారి సతీష్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు పరమేష్ భీమ్‌రెడ్డి, ట్రస్టీ కాశీ కొత్త, మీడియా సలహాదారుడు ఈశ్వర్ బండా, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్లు ఆవిష్కరించిన మంత్రి పెద్దిరెడ్డి


చిత్తూరు జిల్లా సహకార బ్యాంక్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి నివాసంలో సోమవారం రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. చిత్తూరు సహకార బ్యాంక్ దినదినాభివృద్ధి చెందుతూ రైతులకు విశేష సేవలందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ కృష్ణమూర్తి, పాలకవర్గ సభ్యులు కరుణాకరచౌదరి, హరినాథ్‌రెడ్డి, మస్తాన్ సాహెబ్, బాలసుబ్రమణ్యం, బ్యాంక్ సీఈవో మనోహర్ పాల్గొన్నారు.

జగన్ గెలుపునకు యువతే కీలకం : రాష్ట్రంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడం కోసం యువత కీలకంగా వ్యవహరించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నూతన క్యాలెండర్‌ను మంత్రి పెద్దిరెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలకు జగన్ అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్, జిల్లా కార్యదర్శి జంపాల రాజేష్, మునికుమార్, శివకృష్ణయాదవ్, అనీల్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో భారతి సిమెంట్ ప్రతినిధులు


కేక్ కట్ చేస్తున్న సంఘ పెద్దలు, భారతీ సిమెంట్ ప్రతినిధులు


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘ పెద్దలు, పరిశ్రమ ప్రతినిధులు

నాయుడుపేట టౌన్: అన్ని వర్గాలవారిని కలుపుకుంటూ మతసామరస్యానికి ప్రతీకగా భారతి సిమెంట్ యాజమాన్య ప్రతినిధులు వ్యవహరిస్తున్నారని సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి సంఘ పెద్దలు కొనియాడారు. భారతి సిమెంట్స్ కంపెనీ జిల్లా మేనేజర్ జెఎన్.మల్లికార్జునరెడ్డి, స్థానిక డీలర్ల ఆధ్వర్యంలో శిక్షణ పాస్టర్ ఆదర్శ ప్రితమ్ బెన్‌హర్‌తో పాటు సంఘ పెద్దలు చర్చి మాజీ పీసీసీ చైర్మన్ కేజే.జ్ఞానానందం, సండే స్కూల్ సూపరిడెంట్ ప్రేమ్‌చంద్ తదితరులు నాయుడుపేట ఎస్ఏఎల్‌సీ చర్చి ఆవరణలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉన్న పాస్టర్‌తో పాటు సంఘ పెద్దల చేతుల మీదుగా భారీ కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ భారతిసిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు, డీలర్లు, నాయకులతో కలిసి నాయుడుపేట ఎస్ఏఎల్‌సీ చర్చి వద్ద ప్రతి ఏడాదీ క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నట్టు వెల్లడించారు. అన్ని వర్గాల వారిని క్రిస్మస్ వేడుకల్లో భాగస్వామ్యులు చేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారని తెలిపారు.

అనంతరం భారతి సిమెంట్ పరిశ్రమకు సంబంధించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. భారతి సిమెంట్ కంపెనీ జిల్లా టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, డీలర్లు శైలేష్ ట్రేడర్స్ యజమాని కామిరెడ్డి అమరేంద్రరెడ్డి, విజయ గణపతి స్టీల్ అండ్ సిమెంట్స్ యాజమాని ఇరుగు భరత్, బాలాజీ స్టీల్స్ యజమాని కరింబాయి చెంచయ్య మొదలిమార్, నాయకులు పీ.దశరథరామిరెడ్డి, శ్యామ్‌సన్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్‌కు మోహిత్‌రెడ్డి విరాళం


చెక్కును మహిళా వర్సిటీ అధికారులకు అందజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ వేదికగా ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ మహిళల వాలీబాల్ టోర్నమెంట్‌కు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. తుమ్మలగుంట తన నివాసంలో సోమవారం మహిళా వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సారా సరోజినీకి విరాళం చెక్కును ఆయన అందజేశారు. ఈ మొత్తాన్ని టోర్నమెంట్ నిర్వహణకు ఖర్చు చేయాలని సూచించారు. తుడా చైర్మన్‌ను ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సారా సరోజినీ, ప్రొఫెసర్ అరుణ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని ఆహ్వానించారు. ఈ టోర్నమెంట్‌లో కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని 89 యూనివర్సిటీల నుంచి మొత్తం 91 జట్లు పాల్గొంటున్నాయి.

27న నిడ్జమ్ పోటీలకు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: జాతీయ స్థాయిలో నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్(నిడ్జమ్) పోటీలను గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.గిరధర్ రాజు, ఎస్.రాబర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 60, 80, 600 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, కిడ్స్ జావెలిన్ ఈవెంట్లలో పాల్గొనేందుకు అండర్-14, 16బాలబాలికల ఎంపిక పోటీలను ఈ నెల 27వ తేదీ తుమ్మలగుంట క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. అండర్-14 విభాగంలో 27-02-2010 నుంచి 26-02-2012లోపు, అండర్-16 విభాగంలో 27-02-2008 నుంచి 26-02-2010లోపు జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు ప్రవేశ రుసుం ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ తెలిపే సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలని వారు కోరారు.

పేదలకు దుస్తులు పంపిణీ


రేణిగుంటలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: రేణిగుంట మండలంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సెయింట్ జాన్ లూథరన్ చర్చి, జెరూసలెం ప్రేయర్ టవర్‌లలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొని క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులతో కలిసి కేక్‌ను కత్తిరించి పంచిపెట్టారు. నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రజలంతా సుభిక్షంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఏసు ప్రభువును ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, జువ్వల దయాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం, జాన్‌బాబు, నాగరాజు, ఎంజీ రాజేష్ పాల్గొన్నారు.

ఏర్పేడులో..


ఏర్పేడు మండలం, మర్రిమందలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి


ఏర్పేడు మండలం మర్రిమంద ఈసీఐ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొని స్థానికులతో కలిసి ప్రార్థనలు చేశారు. చర్చి పెద్దల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ఆమె పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కావేరి తిరుమలయ్య పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా రచయితల సంఘం ఏర్పాటు


తిరుపతి జిల్లా రచయితల సంఘం నూతన కార్యవర్గం సభ్యులు


తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా రచయితల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈమేరకు సోమవారం సాయంత్రం గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడిగా ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు, అధ్యక్షుడిగా డాక్టర్ సాకం నాగరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రాసాని, తమటం రామచంద్రారెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా యువశ్రీమురళి, డాక్టర్ మాలేపట్టు పురుషోత్తమాచారి, కోశాధికారిగా ఏనుగు అంకమ నాయుడు, సలహా మండలి సభ్యులుగా ఆచార్య మధురాంతకం నరేంద్ర, డాక్టర్ శైలకుమార్, ఆచార్య మధుజ్యోతి, గంగవరం శ్రీదేవి, వి.ప్రతిమ, గాలి గుణశేఖర్ ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి


మృతి చెందిన కృష్ణయ్య (ఫైల్)

ఏర్పేడు: ట్రాక్టర్ బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం ఏర్పేడు మండలం గుడిమల్లం సమీపంలో చోటుచేసుకుంది. సీఐ శ్రీహరి కథనం మేరకు.. ఏర్పేడు మండలం, గుడిమల్లం గ్రామానికి చెందిన కొమ్మిశెట్టి కృష్ణయ్య(51) వ్యవసాయ పనుల అనంతరం కుక్కలగుంట రోడ్డు నుంచి గుడిమల్లం వైపు ట్రాక్టర్‌ను నడుపుకుంటూ వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న క్రిష్ణయ్యపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో చికిత్స నిమిత్తం అతన్ని రేణిగుంట సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనలతో మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి వెళ్లి నివాళి అర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి


మృతుడు చిన్నయ్య

పెళ్లకూరు: మండలంలోని కానూరు రాజుపాళెం గ్రామానికి చెందిన అద్దంకి చిన్నయ్య(72) అనే మతిస్థిమితం లేని వ్యక్తి టర్పంటాయిల్ తాగి తనువు చాలించిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ వివరాల మేరకు.. గ్రామంలోని అరుంధతి వాడకు చెందిన చిన్నయ్య గతకొంత కాలంగా మతిస్థిమితం లేకుండా బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో టర్పంటాయిల్ తాగాడు. అదేరోజు చిన్నయ్య భార్య రమణమ్మ నాయుడుపేట బస్టాండ్‌లో స్వీపర్ పనులు ముగించుకొని ఇంటికి చేరుకోగానే టర్పంటాయిల్ వాసన వచ్చింది. దీంతో భర్త చిన్నయ్యను ప్రశ్నించగా.. అతను తాను తాగిన బాటిల్‌ను చూపించాడు. వెంటనే స్థానికులు చికిత్సలు నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నయ్య సోమవారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రైతు కడగండ్లను ఆవిష్కరించిన 'మట్టి బండి'

- పంచ సహస్రావధాని మేడసాని మోహన్ వెల్లడి

తిరుపతి కల్చరల్: రైతులను ఇతివృత్తంగా చేసుకొని వారి కడగండ్లను ఆవిష్కరిస్తూ రూపొందించిన పుస్తకం మట్టి బండి అని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసానిమోహన్ తెలిపారు. నాగభైరవ ఆదినారాయణ తెలుగులో రాసిన కవితా సంపుటి మట్టి బండి తమిళ భాషలో మణ్వండిగా గాలి గుణశేఖర్ అనువదించారు. విశ్వశ్రీ సమాఖ్య ఆధ్వర్యంలో గంధమనేని శివయ్య భవన్‌లో సోమవారం మట్టి బండి పుస్తకాన్ని ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మట్టి బండి పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. శ్రీకృష్ణదేవరాయులు, తెనాలి రామకృష్ణుడు, చేమకూర వెంకటకవి, దువ్వూరి రామిరెడ్డి, తుమ్మల సీతారామమూర్తి చౌదరి వంటి వారు రైతులను అభివర్ణించారని తెలిపారు. అవధాని ఆముదాల మురళి మాట్లాడుతూ మట్టి బండిని పరిచయం చేస్తూ ప్రపంచీకరణ ప్రభావం రైతులపై తీవ్రంగా ఉందన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలలో దగా పడి రైతు నష్టపోతున్నాడని తెలిపారు. మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ మట్టి బండి కవితా సంపుటి ఒక కండ కావ్యం అన్నారు. యేళ్ల సత్యవతి మాట్లాడుతూ ఇందులో భాష సరళం, భావం బలంగా కవి ఆవిష్కరించారని తెలిపారు.

మండి బండి రాసిన కవి నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ అన్నం తింటున్నాను కాబట్టి మట్టి బండి కవిత రాశారన్నారు. సాహితీవేత్తలు, రచయితలు, కవులు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, బేరం సుందరరావు, నూనె అంకమ్మరావు, సర్వోత్తమరావు, ఏనుగు అంకమ్మ నాయుడు, మన్నవ గంగాధర ప్రసాద్, నాదెండ్ల శ్రీమన్నారాయణ, టెంకాలయ దామోదరం, తోట వేంకటేశ్వర్లు, ధర్మయ్య, యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, గంగవరం శ్రీదేవి, మస్తానమ్మ పాల్గొన్నారు.

ఆలయాలకు ఆర్టీసీ సేవలు


తిరుమల బస్టాండ్ కౌంటర్‌లో టిక్కెట్లు కొనుగోలు చేస్తున్న భక్తులు


తిరుమల బస్సులు ఎక్కుతున్న భక్తులు

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరం నుంచి ప్రత్యేకంగా అన్ని ఆలయాలకు ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేశారు. రాయితీపై టిక్కెట్లు కూడా అందిస్తుండడంతో భక్తుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. తిరుమలకు వెళ్లే భక్తులు రానుపోను టిక్కెట్ తీసుకుంటే రూ.20 వరకు ఆదా అవుతోంది. 99.50 శాతం మంది భక్తులు రానుపోను టిక్కెట్ తీసుకుంటున్నారు. అలాగే తిరుపతి నుంచి తిరుమలతోపాటు శ్రీకాళహస్తి, కాణిపాకం, అప్పలాయగుంట, తిరుచానూరు, శ్రీవారిమెట్టు, శ్రీశైలం, నరసారావుపేట, విజయవాడ, కంచి, తిరువణ్ణామలై తదితర అన్ని ఆలయాలకు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేశారు. దీంతో తిరుపతి ఆర్టీసీ రాష్ట్రంలో అన్నింటిలోనూ మొదటి స్థానంలో నిలుస్తోంది.